క్లుప్తంగా

జమ్మికుంట - కొత్తపల్లి ఎఫ్ఓబీ నిర్మించాలి



ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణ నుంచి కొత్తపల్లి వరకు ఎఫ్ఓబీ(ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్మించాలని కాంగ్రెస్ జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, మైనార్టీ సెల్ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ.సలీం పాషా కోరారు. ఈ మేరకు గురువారం 100 మంది సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందించారు. ఏళ్లుగా కొత్తపల్లి, ధర్మారం, రామన్నపల్లితోపాటు ఇతర మండలాల్లోని గ్రామీణులు నడుస్తూ రైల్వే ట్రాక్ దాటుతున్నారని తెలిపారు. ట్రాక్‌ను విస్తరించడం, రైళ్ల రాకపోకలు పెరిగిపోయిన నేపథ్యంలో ప్రమాదాలు జరుగున్నాయన్నారు. ఎంపీ సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

డబ్బులు పంచుతున్నారని వాగ్వాదం

- కాంగ్రెస్ నాయకులను నిలదీసిన బీజేపీ నాయకులు



కారు నంబర్ ప్లేట్ చూపుతున్న బీజేపీ నాయకులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నాయకునికి చెందిన నంబర్ ప్లేట్ లేని కారులో డబ్బులు తెచ్చి, పంచుతున్నారని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి బోయినపల్లి ప్రవీణ్‌రావు ఆరోపించారు. నాయకులతో కలిసి ఆ వాహనాన్ని చుట్టుముట్టారు. దీంతో ఇరుపార్టీల నాయకులు ఘర్షణ పడ్డారు. చివరకు కారు డిక్కీ ఓపెన్ చేయగా అందులో మూడు నంబర్ ప్లేట్స్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఫొటోతో ఉన్న కరపత్రాలు, బ్యానర్లు కనిపించాయి. ఇవి కూడా ఎందుకున్నాయి, ఎన్నికల నియమావళికి విరుద్ధం కాదా అని బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి, ఇరువర్గాల వారిని అక్కడి నుంచి పంపించారు. నంబర్ ప్లేట్ లేని కారుకు జరిమానా విధించినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చెప్యాల మురళిమనోహర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

రంగపేటలో మల్లన్న పట్నాలు



పట్నం వేసి, ఒగ్గు కథ చెబుతున్న కళాకారులు

మానకొండూర్: మండలంలోని రంగపేట మల్లికార్జున స్వామి దేవాలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం మల్లన్న పట్నాలు వేశారు. స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఏటా మహాశివ రాత్రి రోజు ఇక్కడ పుట్ట బంగారం సేకరణ, హోమం జరపడం, మరుసటి రోజు ఒగ్గు పూజారులు పట్నాలు వేసి, కథ చెప్పడం, స్వామివారి కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోనం మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. యాదవ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊక లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులో గురువారం ఊక లారీ బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటుక బట్టీల కోసం రైస్‌మిల్లు నుంచి ఊక తీసుకెళ్తుండగా బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. ఆ సమయంలో ఎదురుగా ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని వారు పేర్కొన్నారు.



చొప్పదండి: పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన పట్టభద్రులు



కేశవపట్నంలో క్యూలో ఉన్న పట్టభద్రులు



జమ్మికుంట: సీఐ కిశోర్‌తో బీజేపీ నాయకుల వాగ్వాదం

బారులు తీరి.. ఓటేశారు



మానకొండూర్: మాజీ ఎమ్మెల్యే మోహన్



హుజూరాబాద్: ఓటు వేసిన ప్రణవ్

చొప్పదండి/హుజూరాబాద్/మానకొండూర్/గన్నేరువరం/శంకరపట్నం/రామడుగు/గంగాధర/చిగురుమామిడి/జమ్మికుంట: చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు బారులుతీరి ఓటు వేశారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పట్టభద్రులు, టీచర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం పోలింగ్ కేంద్రం వద్ద గుంపుగా ఎవరూ ఉండవద్దని రూరల్ సీఐ కిశోర్ సూచించడంతో బీజేపీ నాయకులు ఇతర పార్టీల వారు ఉన్నారు కదా అంటూ ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఏ పార్టీవారైనా ఉండొద్దని సీఐ అనడంతో కాసేపటికి అందరూ దూరంగా వెళ్లిపోయారు. రామడుగు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో అధికారులు సరిపడా టెంట్లు వేయకపోవడం పట్ల ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.



శంకరపట్నం: వీల్‌చైర్‌లో వస్తున్న పట్టభద్రుడు



రామడుగు: విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు



హుజూరాబాద్: బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



మానకొండూర్: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు



రామడుగు: ఓటు వేసిన మహిళలు



గంగాధర: ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



మానకొండూర్: గేటు వేయడంతో వెనుదిరుగుతున్న పట్టభద్రులు



గన్నేరువరం: పోలింగ్ బాక్సులను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది, పోలీసులు

లోటు నుంచి లాభాల బాట

- ధాన్యం కొనుగోలు కమీషన్‌తో చిగురుమామిడి పీఏసీఎస్‌కు జవసత్వాలు
- 12 కొనుగోలు కేంద్రాలు
- ఏటా 2.80 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు
- ఐదేళ్లలో రూ.4 కోట్ల ఆదాయం
- సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్



గునుకులపల్లెలో పెట్రోల్ పంపును ప్రారంభిస్తున్న చైర్మన్, పాలకవర్గ సభ్యులు (ఫైల్)

చిగురుమామిడి: చిగురుమామిడి పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) లాభాల బాటలో నడుస్తోంది. ఐదేళ్లకు ముందు దాదాపు రూ.కోటి లోటు బడ్జెట్‌లో ఉండేది. కానీ, ఆ తర్వాత సంఘం ఆధ్వర్యంలో మండలంలోని 17 గ్రామాల్లో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ సీజన్‌లో 1.40 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో సీజన్‌కు రూ.40 కమీషన్‌తో ఇప్పటివరకు రూ.4 కోట్ల ఆదాయం సమకూరింది. సంఘం సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ అయ్యింది. సొసైటీకి సొంత భవనం నిర్మించారు. 921 మంది రైతులు రూ.9.57 కోట్ల పంట రుణాలు తీసుకోగా, దీర్ఘకాలిక రుణాల కింద 86 మంది రూ.3.55 కోట్ల రుణాలు పొందారు. వాటిని సమయానికి తిరిగి చెల్లిస్తున్నారు.

రూ.70 లక్షలతో పెట్రోల్ పంపు..

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇందుర్తి గ్రామ పరిధి గునుకులపల్లెలో స్థలాన్ని కొనుగోలు చేసి, 2018లో రూ.70 లక్షలతో పెట్రోల్ పంపు ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేయడంతో కొంత కాలం నిరుపయోగంగా ఉంది. ఆ తర్వాత ప్రైవేటు పంపులకు ఇచ్చిన మాదిరిగానే కేంద్రం అనుమతుల ఇవ్వగా వాటికి దీటుగా నడుస్తోంది.



సొంత భవనంలో పీఏసీఎస్ కార్యాలయం

రైతులకు సబ్సిడీపై ఎరువులు..

చిగురుమామిడి మండల రైతుల కోసం పీఏసీఎస్ నుంచి ఎరువులు సబ్సిడీపై అందిస్తున్నారు. ఇందు కోసం చిగురుమామిడి, ఇందుర్తి, రేకొండ గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతీ సీజన్‌లో ప్రైవేటు ఎరువుల డీలర్లు యూరియాను బ్లాక్ చేసి, విక్రయిస్తుండగా ఈ సంఘం నుంచి తక్కువ ధరకు ఎలాంటి కొరత లేకుండా అందిస్తున్నారు.


రూ.5 లక్షల రుణం తీసుకున్న



చిగురుమామిడి పీఏసీఎస్ నుంచి నా వ్యవసాయ భూమిపై దీర్ఘకాలిక రుణం రూ.5 లక్షలు తీసుకున్న. ఈ డబ్బుతో భూమిని అభివృద్ధి చేసుకోవడంతోపాటు పైప్‌లైన్ వేసి, బావిని లోతుగా తవ్వించాను. అనుకున్న పంట దిగుబడి సాధిస్తున్న. 6 నెలలకోసారి రుణం చెల్లిస్తున్న.

– పెసరి ఐలయ్య, రైతు, సుందరగిరి

ఇటీవల మాఫీ వర్తించింది



సహకార సంఘం నుంచి నేను రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్న. ఏడాదికోసారి మిత్తి చెల్లించి, రెన్యువల్ చేస్తుకున్న. ఇటీవల ప్రభుత్వం చేసిన మాఫీ కూడా వర్తించింది. మళ్లీ రుణం తీసుకున్న. మిగతా బ్యాంకుల పోలిస్తే ఇక్కడ రుణం తీసుకోవడం వల్ల చాలా మేలు జరుగుతుంది.

– బింగి భూమయ్య, రైతు, కొండాపూర్

గోదాం నిర్మించాలన్న ఆలోచన



చిగురుమామిడి సొసైటీకి ధాన్యం కొనుగోలే ప్రధాన వనరు. అలా వచ్చిన ఆదాయంతోనే రైతులకు రుణాలిస్తున్నాం. సర్కారు రెండెకరాల ప్రభుత్వ భూమి ఇస్తే ధాన్యం నిల్వ చేసేందుకు గోదాం నిర్మించాలన్న ఆలోచన ఉంది.

– జంగ వెంకటరమణారెడ్డి, చైర్మన్, పీఏసీఎస్ చిగురుమామిడి

ఇరుకుల్ల పాత రోడ్డు మూసివేత

- అడ్డుగా కొత్త రోడ్డు నిర్మాణం
- నేషనల్ హైవే కాంట్రాక్టర్ నిర్వాకం

కరీంనగర్‌రూరల్: జగిత్యాల–వరంగల్ హైవే రోడ్డు కాంట్రాక్టర్ ఇరుకుల్ల పాత రోడ్డును మూసివేసి కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టడం వివాదాస్పదంగా మారింది. కాంట్రాక్టర్ చేపట్టిన రోడ్డు పనులతో రెండు గ్రామాల ప్రజలకు దారి కరువైంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. జగిత్యాల–వరంగల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ ఇరుకుల్ల వద్ద రాజీవ్ రహదారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నాడు. బ్రిడ్జికి అనుసంధానంగా ఇరువైపులా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాడు. దీనిలో భాగంగా ఇరుకుల్ల పాతరోడ్డును మూసివేసి పాతరోడ్డుకు అడ్డుగా రోడ్డు నిర్మిస్తుండటంతో ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామాల ప్రజలకు దారి లేకుండా పోయింది. రెండు గ్రామాల రైతులు పొలాలకు, సమ్మక్క సారక్క జాతర నిర్వహణ, పద్మనాయక సంఘం శ్మశాన వాటికకు వెళ్లేందుకు ఉపయోగపడే పాత రోడ్డును మూసివేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరుకుల్ల పాత రోడ్డుపై ఉన్న వంతెన వరదలకు కొట్టుకపోవడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో కొత్త వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లను మంజూరు చేశారు. ప్రజలందరికీ ఉపయోగపడే ఇరుకుల్ల పాత రోడ్డును మూసివేసిన కాంట్రాక్టర్‌పై ఆర్అండ్‌బీ అధికారులు తగిన చర్యలు చేపట్టడంతో పాటు దారిని యథావిధిగా పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పాత రోడ్డుకు అడ్డుగా నిర్మించిన రోడ్డు

ఎండలోనే కూరగాయల విక్రయం

- కేశవపట్నం వారసంతలో వ్యాపారులు, రైతుల ఇబ్బందులు
- స్టాల్స్ ఏర్పాటు చేయాలని వేడుకోలు



గత సోమవారం ఎండలో కూరగాయల క్రయవిక్రయాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం వారసంతలో రైతులు, వ్యాపారులు ప్రతీ సోమవారం మండుటెండలో కూరగాయలు విక్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేయకపోవడంతో వేసవిలో ఎండ, వర్షాకాలంలో వానలోనే కూరగాయలు, దుస్తులు, పండ్లు, వంట సామగ్రి విక్రయాలు జరుగుతున్నాయి. శంకరపట్నం మండలంలోని వివిధ గ్రామాల రైతులు, ఇతర ప్రాంతాలకు చెందిన వీధి వ్యాపారులు దాదాపు 200 మంది ఇక్కడికి వచ్చి, అమ్మకాలు సాగిస్తుండటంతో ఈ సంత రద్దీగా ఉంటుంది. గతంలో ఇక్కడ నిర్మించిన మార్కెట్ స్టాల్స్ మాదిరిగా లేదు. అది నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. సంత నిర్వహణకు గత పంచాయతీ పాలకవర్గం రూ.2 వేల చొప్పున వసూలు చేసిందని, సౌకర్యాలపై అడిగితే ఆ డబ్బులతో మొరం పోయించినట్లు చెబుతున్నారని అంటున్నారు.

మార్కెట్‌లో లైట్లు లేవు



కేశవపట్నం సంతలో కూరగాయల విక్రయానికి రూ.2 వేలు తీసుకున్నరు. ఇక్కడ లైట్లు లేవు. వానాకాలంలో బురద నీరు, ఎండకాలంలో ఎండలతో ఇబ్బంది పడుతున్నం.

– పద్మ, కూరగాయల వ్యాపారి, తాడికల్

స్టాల్స్ నిర్మించాలి



కూరగాయలు అమ్ముకునేందుకు సంత టెండర్ దక్కించుకున్నవారికి ప్రతీ సోమవారం రూ.50 ఇస్తున్నం. ఎండల దృష్ట్యా నీడ సౌకర్యం కల్పించాలని కోరితే పట్టించుకుంటలేరు.

– సదయ్య, కూరగాయల వ్యాపారి, తాడికల్

పట్టించుకుంటలేరు



నేను అన్ని మార్కెట్లకు వెళ్లి, కూరగాయలు అమ్ముకుంట. అక్కడ సౌకర్యాలు ఉన్నాయి. కేశవపట్నంలోనే నీడ, రాత్రి లైట్లు, నీరు, బాత్‌రూం వసతులు లేవు. అధికారులు పట్టించకుంటలేరు.

– విజయ్, కూరగాయల వ్యాపారి, గోపాల్‌రావుపేట

పుస్తకాలు బహూకరణ



పుస్తకాలు అందిస్తున్న సేనాధిపతి

కరీంనగర్‌టౌన్: శ్రీసరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నడుస్తున్న కరీంనగర్ గాయత్రినగర్‌లోని శ్రీసరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి ప్రముఖకవి, రచయిత దాస్యం సేనాధిపతి గురువారం రూ.17 వేల విలువ గల పుస్తకాలు బహూకరించారు. గ్రంథధాలయ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బల్మూరి కరుణాకర్‌రావు, కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్‌రావు, కొండా గంగాధర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పాఠశాల ప్రధానాచార్యుడు సముద్రాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

కళాశ్రీ పురస్కారానికి ఎంపిక

కరీంనగర్ కల్చరల్: కళాశ్రీ పురస్కారానికి కాండూరి వెంకటేశ్వర్లు ఎంపికై నట్లు కళాశ్రీ వేదిక నిర్వాహకుడు గుండేటి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సప్తగిరికాలనీలోని ఆయన నివాసంలో శుక్రవారం సాహితీవేత్త గంద్ర లక్ష్మణరావు చేతులమీదుగా అందిస్తామన్నారు.